www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 4 మార్చి 2023



ప్రాక్టికల్స్ పేరుతో అక్రమాలు : ఎస్ఎఫ్ఐ


ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రాక్టికల్స్ పేరుతో అక్రమాలకు పాల్పడిన కార్పొరేట్, ప్రయివేట్ జూనియర్ కళాశాలలపై ఆర్ఐఒ రమణరాజు విచారణ జరిపి చర్యలు తీసుకొవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రస్తుతం ఇంటర్, ఒకేషనల్ ప్రాక్టికల్స్ జరుగుతున్నాయని తెలిపారు. రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లో కార్పొరేట్, ప్రయివేట్, ఒకేషనల్ ఎయిడెడ్ కళాశాలల యాజమాన్యాలు ప్రాక్టికల్స్‌లో అధిక మార్కులు వేస్తామని చెప్పి ఎటువంటి రసీదు ఇవ్వకుండా రూ.1300 నుంచి రూ.రెండు వేల వరకు విద్యార్థుల తల్లిదండ్రులు నుండి అక్రమంగా వసూలు చేశారని పేర్కొన్నారు. దీని వలన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. రాయచోటి, కోడూరు, రాజంపేట ప్రాంతంలోని ఒకేషనల్ జూనియర్ కళాశాలలో డమ్మీ అభ్యర్థులతో ప్రాక్టికల్స్ చేపిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఆర్ఐఒ స్పందించి ఆయా కళాశాలలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.కోట్లు విలువైన
ప్రభుత్వ స్థలాలు కబ్జా

- పాలకుల అండదండలతో ఆక్రమణ
- విచ్చలవిడిగా వెలసిన దుకాణాలు
- పట్టని అధికారులు

రెండో భద్రాద్రిగా పేరుగాంచిన ఒంమిట్టలో కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. పాలకుల అండదండలతో కొందరు యథేచ్ఛగా ఆక్రమించుకుని దుకాణాలను నెలకొల్పుతున్నారు. ఇన్నీ తెలిసినా ఏమీ చేయలేని స్థితిలో అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.



కడప-చెన్నై ప్రధాన రహదారి సమీపంలో ఉప్పరపల్లి వద్ద వెలసిన వస్త్ర దుకాణం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట (సిద్ధవటం)

మండలంలో పరిధిలోని కడప-చెన్నై రహదారి ఉప్పరపల్లె గ్రామ సమీపన రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 936లో కొందరు స్థానికు నాయకులు బడా రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమించుకుని పట్టణాలకు ధీటుగా షాపింగ్ మాల్స్‌ను నిర్మించుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఉప్పరపల్లిలోని కొందరు బడా వస్త్ర వ్యాపారులు పేదలకు అందాల్సిన ప్రభుత్వ స్థలాలను పక్కాగా ప్రణాళిక రచించి బినామి పేర్లతో కోట్లు విలువజేసే స్థలాల్లో పెద్దపెద్ద భవంతులను నిర్మించుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అదే ఇళ్లు లేని పేదలు ఇంటి నివేశన స్థలాల కోసం దరఖాస్తు చేసుకుని, కాళ్లు అరిగేటట్లు రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరిగినా కనికరించని అధికారులు అదే బడా వ్యాపారవేత్తలు ఆక్రమించుకుంటే పట్టీ పట్టనట్లుగా వ్యవహించడం శోచనీయం. వారికి ఎలాంటి నిబంధనలు వర్తించవు. ఒకొక్కరు సుమారు పది నుంచి 50 సెంట్ల వరకు ఆక్రమించుకుని భవంతులు నిర్మించుకుని వ్యాపారాలు సాగిస్తూ కోట్లు ఆర్జిస్తున్నారు. పేదలు నిలువ నీడ లేని పేదలకు ప్రభుత్వ స్థలాల్లో పూరిగుడిసెలు నిర్మించుకుంటే కేసులు పెట్టడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా సంబంధితాధికారులు జోక్యం చేసుకుని కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుని ఇళ్లు లేని పేదలకు పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు ఏమన్నారంటే..

ఉప్పరపల్లిలో నిర్మించిన భవంతులపై విచారించి నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తహశీల్దార్ శంకర్‌రావు పేర్కొన్నారు. నిబంధనలు విరుద్ధంగా నిర్మించి ఉంటే చట్టరీతా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే గ్రామసచివాలయ పంచాయతీ కార్యదర్శికి పూర్తి సమాచారం అందించాలని ఆదేశాలు జారీ చేశామని ఎంపిడిఒ పులిరామ్‌సింగ్ అన్నారు. భవ నిర్మాణాలకు సంబంధించి పంచాయతీ అప్రూవల్ అయిందా లేదా, బకాయిలు చెల్లిస్తున్నారా? లేదా అన్ని వివరాలు లిఖిత పూర్వకంగా అందించాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి ఆదేదేశించామని తెలిపారు.

తెలుగుగంగ స్థిరీకరణకు
కసరత్తు!



- రూ.28 కోట్ల కాల్వల పెండింగ్ పనుల్లో కదలిక
- భూసేకరణకు రూ.6.3 కోట్లు కేటాయింపు
- 1.58 లక్షల ఎకరాలకు సాగునీటి కల్పన
- 2024 పూర్తి దిశగా పనుల జోరు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్రహ్మసాగర్ స్థిరీకరణ కసరతుఎ0.2 జోరందుకుంది. తెలుగుగంగ ఇంజినీరింగ్ యంత్రాంగం పెండింగ్ పనులపై దృష్టి సారించింది. కుడి, ఎడమ కాల్వల్లోని పెండింగ్ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా ఎంచుకుంది. ఆర్నెళ్ల కింద కుడి, ఎడమ కాల్వల్లో పెండింగ్ పనులకు రూ.28 కోట్లతో టెండర్లు పిలిచింది. రూ.6.3 కోట్లను భూసేకరణకు కేటాయించింది. ప్రధానంగా ఎడమ కాల్వలో భాగమైన పోరుమామిళ్ల-బద్వేల్ కాల్వ పనులు పరుగులు పెడు తుండడం ఆశలు రేపుతోంది. జిబిసి, ఒబిసి కాల్వల పెండింగ్ పనులు దశాబ్దాలుగా వేధిస్తున్న సంగతి తెలిసిందే. మొదటగా కుడి, ఎడమ కాల్వల్లోని పెండింగ్ పనుల బిట్లను గుర్తించింది. పెండింగ్ పనుల బిట్లను పూర్తి చేయడమే లక్ష్యంగా సాగుతోంది. జిబిసి, ఒబిసి కెనాల్ పనుల్ని సకాలంలో పూర్తి చేయగలిగితే 30 వేల ఎకరాలు ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది. ఫలితంగా తెలుగుగంగ రిజర్వాయర్ కింద పూర్తి స్థాయిలో సాగు నీటిని అందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిబిసి కింద 20 వేల ఎకరాలు, ఒబిసి కింద 10 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు నోచుకునే అవకాశం ఉంది.బ్రహ్మసాగర్ రిజర్వాయర్ కింద సాగులో ఉన్న 96,500 ఎకరాల ఆయకట్టుకు అదనంగా కలవనున్న 30 వేల ఎకరాల ఆయకట్టు కారణంగా 1.30 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బ్రహ్మసాగర్ రిజర్వాయర్ పరిధిలోని 1.58 లక్షల ఆయకట్టు లక్ష్యాన్ని సుమారుగా అందుకునే దిశగా కదులుతోంది. 2024 డిసెంబర్ నాటికి బ్రహ్మసాగర్ రిజర్వాయర్ కాల్వల పెండింగ్ పనుల్ని పూర్తి చేయడమే లక్ష్యంగా కదులుతున్న నేపథ్యంలో ఆయకట్టు రైతాంగంలో ఆసక్తి నెలకొంది.

ప్రాణ భద్రత.. సామాజిక బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల ప్రాణ భద్రత మనందరి సామాజిక బాధ్యతని, ఆ దిశగా జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తం, సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ గిరీష సంబంధితాధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వివిధ శాఖల అధికారులతో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. అధికారులు డ్రంక్ అండ్ డ్రైవ్ పకడ్బందీగా అమలు చేసి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాల మూలంగా ఏవ్వరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా రోడ్డు ప్రమాదాల నివారణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, కల్వర్టులు, రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారులపై అవసరం మేరకు వేగ నిరోధకాల సూచిక బోర్డ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మనం తీసుకొనే చర్యలు ప్రయోజనం కలిగించే విధంగా ఉండాలన్నారు. అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోవడం జరుగుతోందని ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. బస్సులు, లారీలు, ఇతర వాహనాలలో అధిక లోడుతో రవాణా చేసే వారిపై చర్యలు తీసుకోవలసిందిగా రవాణ శాఖ అధికారులను ఆదేశించారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి వారికి ఫైన్ వేయాలని సూచించారు. పెద్ద వాహనాలు, ట్రిప్పర్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు వెనుక వైపు రేడియం స్టిక్కర్ లు తప్పనిసరిగా ఉండాలని, ఇందుకు సంబంధించి పోలీసు, రవాణా శాఖ పక్కా ప్రణాళికతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒ త్యనారాయణ, జిల్లా రవాణా అధికారి శాంత కుమారి, ఆర్టీసీ, ఆర్అండ్‌బి, జాతీయ రహదారుల ఇంజినీరింగ్ అధికారులు, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

'కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బడినికొండ గ్రామ పంచాయతీ సాయి కొండ ప్రాంతంలో రైతుల అనుమతులు లేకుండా మట్టిని తవ్వి తరలించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టర్‌కు సహకరించిన తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సిపిఐ నాయకులు కృష్ణప్ప మాట్లాడుతూ తురకపల్లి గ్రామ పంచాయతీలో నివాసముండే ఏడుగురు ముస్లీం మైనారిటీకి చెందిన పేద రైతులకు భూపంపిణీ పట్టాలు ఇచ్చారని, ఈ పట్టాలను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేయకుండా, వారి అనుమతులు తీసుకోకుండా కాంట్రాక్టర్‌తో డబ్బుకు అమ్ముడుపోయారని విమర్శించారు. రైతుల పొలాల్లో మట్టిని తవ్వడానికి తహశీల్దార్ సహకరించారని తెలిపారు. నేషనల్ హైవే పేరుతో మట్టిని తవ్వి ప్రైవేట్ స్థలాలకు తరలిస్తున్నారని, ఇదే మట్టిని వేల రూపాయలకు అమ్ముకొని వ్యాపారం చేసుకొంటున్నారన్నారు. సాయికొండ సగానికి పైగా తవ్వి అమ్ముతుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. తహశీల్దార్ నుంచి సచివాలయం అధికారుల వరకు అందరికీ పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టాయని అందుకే ఏ అధికారి కూడా పట్టించుకోలేదని అనుమానం వ్యక్తం చేశారు. రైతులకు ఏ ప్రాతిపదికన తమ పాస్ బుక్కులను ఎందుకు ఆన్‌లైన్ చేయలేదో చెప్పాలన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి పట్టాలు ఉన్న ముస్లీం మైనారిటీ రైతులకు తమ పట్టాలను ఆన్‌లైన్ చేసి పాస్‌బుక్‌లు ఇవ్వాలని తెలిపారు. రైతుల అనుమతులు లేకుండా మట్టిని తవ్విన కాంట్రాక్టర్‌పై కేసులు నమోదు చేయాలని, వారికి సహకరించిన రెవెన్యూ, సచ్చివాలయం అధికారులను, తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి బాధితులు షఫీ, ఫిరోజీ, మబ్బాష, జయనబీ, గులజరబీ పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు



లోకేష్ పాదయాత్రలో జగన్మోహన్‌రాజు

యువగళం పాదయాత్రలో 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పాల్గొన్నారు. శుక్రవారం పుంగనూరు నియోజకవర్గంలో లోకేష్‌తో పాటు ఆయన పాదయాత్రలో పాల్గొన్నారు.

రేపు విశ్వహిత డిగ్రీ కళాశాలలో టాలెంట్ హంట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక విశ్వహిత డిగ్రీ కళాశాలలో ఈ నెల 5వ తేదీన టాలెంట్ హంట్-2023 నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ పి.ఉదయభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టాలెంట్ హంట్ సీనియర్ ఇంటర్ విద్యార్థులకు మాత్రమేనని ఇందులో కామర్స్ అండ్ అకౌంట్ సిలబస్ సంబంధించి 50 మార్కులకు, ఎకనామిక్స్ 30 మార్కులకు, ఇంగ్లీష్ 20 మార్కులకు ఉంటాయని తెలిపారు. ఇందులో ఉత్తీర్ణులైన మొదటి 10 స్థానాలు సాధించిన విద్యార్థులు మొదటి బహుమతి రూ.5 వేలు, రెండవ బహుమతి రూ.3 వేలు, మూడవ బహుమతి రూ.2 వేలతో పాటు 10 లోపు విద్యార్థులకు తగిన బహుమతి అందజేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే ఉపేక్షించమని రాజంపేట తహశీల్దార్ ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ గిరిష ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి బోర్డులు నాటామన్నారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా భూ కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మదనగోపాలపురం గ్రామ పంచాయతీలోని ఇసుకపల్లిలో గతంలో పేదలకు ఇంటి స్థలాలను మంజూరు చేశామని తెలిపారు. పేదలకు మంజూరు చేసిన స్థలాలను కొందరు ఆక్రమించుకొని అక్రమాలకు పాల్పడుతున్నట్లు బాధితుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేకుండా చెరువుల్లో నుండి మట్టి తవ్వకాలు చేపట్టరాదన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమించినా, చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపట్టినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఈ నెల 13న జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 20 పోలీసు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో నిరంతరం పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తారన్నారు. రాజంపేటలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌లో రాజంపేట అర్బన్ సిఐ చేపట్టిన తనిఖీలో రెండు వాహనాల నుంచి రూ.35 లక్షలు, మన్నూరు సిఐ రూ.2.70 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మదనపల్లి, వాయల్పాడు, గుర్రంకొండలలో నాకా బందీ చేపట్టారు. మద్యం, నాటుసారా అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు, ఎస్ఇబి సంయుక్తంగా 263 ప్రాంతాల్లో దాడులు చేసి 160 కేసులు నమోదు చేసి 130 మంది ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి 913 లీటర్ల నాటు సారా, 2710 మద్యం పాకెట్లు, 15 వాహనాలను స్వాధీనం చేసుకొని 27,500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశంతో ఎన్నికల నియమావళి మొదలైనప్పటి నుండి ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 1119 మందిని మండల తహశీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామన్నారు. జిల్లాలో సుమారు 709 లైసెన్సు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న బోర్డర్ చెక్ పోస్టులకు అదనంగా సాయుధ బలగాలతో పికెట్స్, చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాటిని 24 గంటలూ షిఫ్ట్‌ల పద్ధతిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సందర్భంగా జిల్లాలో ఎవరూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని అలా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

'అటవీ సంపదను రక్షించుకోవాలి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అటవీ సంపదను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైన ఉందని జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ అన్నారు. ప్రపంచ వైల్డ్ దినోత్సవాన్ని పురష్కరించుకొని శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అడవి కన్న తల్లి లాంటిదని, అడవిని సురక్షితంగా సంరక్షించుకోవాలని తెలిపారు. అడవికి నిప్పు పెట్టడం వలన వృక్ష సంపదతో పాటు వన్యమృగాలు మృత్యువాత పడతాయని తెలిపారు. అడవులు నశిస్తే మానవ మనుగడకే ప్రమాదమన్నారు. అనంతరం జిల్లా నలుమూలల నుండి వచ్చిన 21 మంది విద్యార్థులకు ఆయన బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాజంపేట రేంజ్ అధికారి నారాయణతో పాటు జిల్లాలోని రేంజ్ అధికారులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** వన్యప్రాణులు మానవ మనుగడకు ఎంతో అవసరమని, వన్యప్రాణులను కాపాడుకోవడం మనందరి బాధ్యతని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న జంతువులు, మొక్కలపైన అవగాహన పెంచడానికి, వాటిని రక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మనం పీల్చే గాలి, తినే ఆహారం, మనం ఉపయోగించే శక్తి వంటి అనేక ఇతర ప్రయోజనాల కోసం మొక్కలు, జంతువులపై ఆధారపడి ఉన్నామని, మనకు అవసరమైన పదార్థాలన్నీ ప్రకృతి నుండే పొందుతున్నాయన్నారు. **రాయచోటి:** వన్య ప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణులు, మొక్కల మనుగడతోనే మానవాళి మనుగడ సాధ్యమన్నారు. లక్షలాది మంది తమ జీవనోపాధి, ఆర్థిక అవసరాలకు ప్రకృతిపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. వన్యప్రాణులు మనకు ఆహారం, ఇంధనం, ఔషధాలు, గృహపోకరణాలు, వస్త్రాలు, వినోదం మొదలైనవి అందిస్తున్నాయన్నారు. వన్య జీవులను సంరక్షించడానికి అడవులను నరకడం, వేటాడటం, నిప్పు పెట్టడం, పోడు వ్యవసాయం వంటి కార్యకలాపాలను ఆపాలన్నారు. ప్రకృతితో మన సంబంధాన్ని స్నేహపూరితంగా మార్చుకోవాలని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందరరేగా 'వన్యప్రాణుల సంరక్షణ కోసం భాగస్వామ్యాలు' అనే ఇతివృత్తాన్ని నిర్ణయించారన్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం విద్యార్థులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. నేషనల్ గ్రీన్ కోర్ విద్యార్థులు వన్యప్రాణుల ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించాలన్నారు. వాటి సంరక్షణ గురించి ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 65 జీవ జాతులు ముప్పు వాటిల్లిన జాతులుగా గుర్తించబడ్డాయన్నారు. అందులో 22 మొక్క జాతులు, 19 పక్షి జాతులు, 10 క్షీరదాలు, 12 చేప జాతులు, రెండు సరిసురుపాల జాతులు ఉన్నాయన్నారు. మనం వీటిని సంరక్షించకపోతే సమీప భవిష్యత్తులో ఇవి మనకు కనిపించవు అన్నారు. అనంతరం విద్యార్థులతో వన్యప్రాణి సంరక్షణ ప్రతిజ్ఞను చేయించారు. వన్యప్రాపాణి సంరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వకృత్వ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజంపేట : బహుమతులు అందజేస్తున్న జిల్లా అటవీ అధికారి వివేక్

ఎస్‌బిఐ మెసెంజరే నిందితుడు : డిఎస్‌పి

ఒంటిమిట్ట : ఎస్‌బిఐలో పనిచేస్తున్న మెసెంజర్ లక్ష్మీనారాయణ అనే వ్యక్తే రూ.56 లక్షలు దోపిడీ చేశారని కడప డిఎస్‌పి శివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితుడు ఒంటిమిట్ట స్టేట్ బ్యాంక్‌లో 2014 నుంచి మెసెంజర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. బ్యాంకు వచ్చే ఖాతాదారుల ఐడి నుంచి లావాదేవీలు నడుపుతూ వారి ఖాతాలోని డబ్బులను తీయడం, వేయడం చేసేవాడని పేర్కొన్నారు. నమ్మకంగా ఉంటూ 2022 నుంచి బ్యాంకులో దోపిడీకి పాల్పడ్డారని వివరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ రెడ్డయ్యానాయుడు బ్యాంకు కెవైసిలో తన ఫోన్ నంబర్‌ను అటాచ్ చేయాలని ఇవ్వగా సుమారు రూ.56 లక్షలు అపహరించాడని విచారణలో తేలిందని డిఎస్‌పి చెప్పారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సిఐ పురుషోత్తమ్‌రాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

కడప: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వ్యాపితంగా నిర్వహించే స్పెషల్ లోక్ అదాలత్‌ను ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మొదటి అదనపు జిల్లా జడ్జి, ఇన్‌ఛార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సి. ఎన్. మూర్తి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత విజ్ఞప్తి చేశారు. స్పెషల్ లోక్ అదాలత్‌లో కుటుంబ తగదాలకు సంబంధించిన కేసులు, వినియోగదారులకు సంబంధించిన కేసులు, ఐపిఆర్ కు సంబంధించిన కేసులను మాత్రమే రాజీ చేసుకోవచ్చున్నారు. పూర్తి సమాచారం కోసం 08562-258622, 244622లలో సంప్రదించాలన్నారు.

రెండు వికెట్ల తేడాతో 'ఎ' జట్టు విజయం

కడప: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన అండర్-23 మాయచ్‌లో రెండు వికెట్ల తేడాతో టీమ్-ఎ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన అండర్-23 టీం-ఏ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన అండర్-23 టీం-బి జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 21.3 ఓవర్లను ఎదుర్కొని 99 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని ఎల్. కళ్యాణ్ కృష్ణ 16, ఇంద్రసేనారెడ్డి 15 పరుగులు చేశారు. టీం-బి జట్టులోని ఎం. ధనుష్ 4,ఎం. చెన్నారెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 100 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీం-ఏ జట్టు 21.4 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 101 పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని కె. మారుతి శంకరాచారి 26, ఎం. శ్రీనివాసుల రెడ్డి 15 పరుగులు చేశారు. టీం-బి జట్టులోని షేక్ ఆదిల్ హుస్సేన్ 3, నిత్య, పృద్వి లు చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

కళాదర్శిని ఆర్ట్ గ్యాలరీని సందర్శించిన జవహర్ బాబు

కడప అర్బన్: యోగి వేమన విశ్వవిద్యాలయం కళా దర్శిని ఆర్ట్ గ్యాలరీని కేంద్ర కారాగార డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జవహర్ బాబు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన కళా ఖండాలను మెచ్చుకుని, సామాజిక, మానసిక రుగ్మతలను నివారించి, ఉత్తమ సమాజ నిర్మాణానికి కళలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ముఖ్యంగా యువత ఏదో ఒక కళలో ప్రావీణ్యం లేదా కనీస పరిచయం సంపాదించాలి పేర్కొన్నారు. గ్యాలరీ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట మృత్యుంజయరావు గ్యాలరీలో ఉన్న కళాఖండాలను గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్ బాబు, సీ.హెచ్. అప్పలచారి, బి.ఈరప్ప పాల్గొన్నారు.



మందులషాపు నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్న వైద్య సిబ్బంది

మందుల దుకాణం యజమానులకు నోటీసులు

ప్రజాశక్తి-నందలూరు

మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వైద్యాన్ని అందించి, మందులను పంపిణీ చేస్తున్న ఆర్ఎంపిలు, మెడికల్ స్టోర్లకు డిప్యూటీ డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. మండలంలో ఇటీవల ఆర్ఎంపి వైద్యశాలలు, మెడికల్ స్టోర్లపై రాజంపేట డిప్యూటీ డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యాన్ని అందిస్తున్న ఆర్ఎంపి వైద్యులపై, మెడికల్ స్టోర్లలో నిబంధనలకు విరుద్ధంగా మందులను అమ్ముతున్న వారిపై వైద్యశాలలో రిజిస్టర్ చేసుకోక పోవడంతో వారికి నోటీసులు జారీ చేశారు. సోమవారం లోపల జారీ చేయబడిన మెడికల్ స్టోర్లు, ఆర్ఎంపి వైద్యులు రాజంపేట డిప్యూటీ డిఎంహెచ్ఒకు వివరణ ఇవ్వాలని తెలిపారు.



మాట్లాడుతున్న దర్శకుడు బిఆర్.ప్రసాద్

నూతన నటీనటులకు అవకాశం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఓపెన్ మైండ్స్ అండ్ సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ పై నిర్మితమౌతున్న రావణకాష్ట సినిమాలో నటించడానికి నూతన నటీ నటులకు ఆహ్వానం పలుకుతున్నట్లు దర్శకుడు బి.ఆర్.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ బి.ఆర్ ప్రసాద్, కో-డైరెక్టర్ శివాజీ, సదా వంశీ, యాక్టర్ ఉమేష్ కుమార్, గౌస్ బాష, ఉదయ్ కుమార్, లోకేష్, ప్రిన్స్ విజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 5న మదనపల్లె దేశాయ్ లాడ్జిలో నటీ నటుల ఎంపిక జరుగుతోందని తెలిపారు. చైల్డ్ ఆర్టిస్టులు, హీరో, హీరోయిన్, క్యారెక్టర్ ఆర్టిస్టు, లైట్ బాయ్స్, ఎడిటర్స్ తదితర అంశాలలో నూతన నటీ నటులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ దేవస్థానం వార్షికోత్సవం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పట్టణం మన్నూరులోని ఉదయగిరి ఎల్లమ్మ దేవస్థానంలో ఆరవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు నాగేంద్ర, మణికంఠలు అభిషేకములు, పూజా కైంకర్యములు నిర్వహించారు. భక్తి శ్రద్దలతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ ఆధ్యాత్మిక ఉపన్యాసం గావించారు. భక్తుల సహకారంతో సుమారు 2500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బత్యాల చెంగల్రాయుడు, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

లింగ వివక్షపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కస్తూరిబా పాఠశాలలో విద్యార్థినిలకు కోనవారిపల్లి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ మునికుమార్ ఆదేశాల మేరకు ముందస్తుగా లింగ వివక్షత, బేటి బచావో బేటి పడావో, సెక్స్ రేషియో గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లల నిష్పత్తి మగ పిల్లల నిష్పత్తి సమానంగా ఉండాలని సూచించారు. రక్తహీనత రాకుండా ఐరన్ పోలిక్ ఆసిడ్ మాత్రలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించి చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. బాలికలందరూ అన్ని రంగాల్లో ముందు ఉండాలని కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.సుమతి, టివి.రమణ పాల్గొన్నారు.

మామిడి తోటకు నిప్పు

ములకలచెరువు : పిటిఎం మండలంలోని, మల్లెలకు చెందిన వెంకట్‌రెడ్డి చెందిన మామిడితోటకు ఏర్పాటు చేసి కల్లకు గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. కల్ల దాటుకొని మామిడిచెట్లకు మంటలు వ్యాపించాయి. రైతు ములకలచెరువు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. రైతుకు సుమారు రూ.1.70 లక్షలు నష్టం వాటిల్లిందని తెలిపాడు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

అన్నదానం గొప్పది

ములకలచెరువు : మండల పరిధిలోని కదిరినాథునికోటకు చెందిన పారిశ్రామికవేత్త దాసిరిపల్లి జయచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో భారీగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మూడు రోడ్ల కూడలిలో తన అభిమాని సిద్ధ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి, టపాకాయలు పేల్చుతూ, ఘనంగా జన్మదిన వేడుకలు జరిపారు. నైతిక విలువలే నిజమని నమ్మిన అభ్యుదయవాది జయచంద్రారెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో గౌతమ్, శివ, విజయ్ పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

రైతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కృషి విజ్ఞాన కేంద్రం పనిచేస్తోందని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు. శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రంలో 11వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాండురంగ 2022వ సంవత్సరంలో కెవికె ఆధ్వర్యంలో రైతులకు అందించిన సేవలు, వివిధ శిక్షణ కార్యక్రమాల గురించి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన సలహాలు, సూచనలు అందించి వారి అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. శాస్త్రవేత్తలు రైతుల పొలాల్లో చేపట్టే క్షేత్ర పరిశీలన, ప్రథమశ్రేణి క్షేత్రాలను, ఫలితాలను తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ సి.రమణ, హైదరాబాదు ప్రధాన శాస్త్రవేత్త భారతీయ పరిశోధన మండలి డాక్టర్ ఎఆర్.రెడ్డి, గుంటూరు ప్రధాన శాస్త్రవేత్త డిడిఇ డాక్టర్ వై. వి.విశాలాక్షి, డాక్టర్ ఆర్.శారద, చిత్తూరు డాట్ కోఆర్డినేటర్



మాట్లాడుతున్న కెవికె కో-ఆర్డినేటర్ పాండురంగ

జయలక్ష్మి, డాక్టర్ సి నాగమణి, డాక్టర్ కె.రాఘవేంద్ర, జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఉద్యానశాఖ అధికారి రవిచంద్ర, ఇతర శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు డాక్టర్ సునీత, డాక్టర్ దేవకి, డాక్టర్ హేమలత, డాక్టర్ కలీముల్ల, కెవికె శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

ఆగిన అంగన్వాడీ భవన నిర్మాణాలు



నిధుల కొరతతో ఆగిన అంగన్వాడీ భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న అంగన్వాడీ భవన నిర్మాణాలు మధ్యలోనే నిధులు లేక ఆగిపోయాయని స్థానికులు, అంగన్వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంలో మండలంలోని దాదాపు 30 పాఠశాలలు మంజూరు అయ్యాయని తెలిపారు. మూడు నెలల నుంచి నిర్మాణాలు నిధులు లేక ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆ భవనాలకు నిధులు మంజూరు చేసి చేసి పనులు ప్రారంభమయ్యేందుకు కృషి చేయాలని కోరారు. కొన్ని గ్రామాలలో తహశీల్దార్ ద్వారా పనులు ప్రారంభించినా నిధులు లేక మధ్యలోనే ఆగిపోవడం బాధాకరమని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిధులు మంజూరయ్యేందుకు సహకరించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు రాకముందే పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమ పాలన టిడిపితోనే సాధ్యం : ఆర్ఆర్

ప్రజాశక్తి-చిన్నమండెం

సంక్షేమ పాలన టిడిపితోనే సాధ్యమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నర్సుపల్లె పంచాయతీలోని టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలసి ఇదేంఖర్మ రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి అక్రమాలు పెరిగి పోయాయని, నిత్యావసర సరుకులు మొదలు పెట్రోలు, డీజిల్ లను అధికంగా పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో దారిద్రరేఖకు దిగువనున్న కుటుంబాల జీవనం చాలా ఇబ్బందిగా మారిందని అన్నారు. సంక్షేమ పాలన కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు టిడిపి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇంఛార్జి, బెల్లం నరసింహారెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జిలు బాసిత్‌ఖాన్, చెన్నకృష్ణరెడ్డి, దేవగోపాల్



రమేష్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామ నాయకులు

నాయుడు, హరి అమర్నాధ్ రెడ్డి, గంగన్న,మాజీ మండల అధ్యక్షులు వెంకటాద్రి, వేల్పుల చెన్నయ్య పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఇఒ రంగనాథయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. నాలుగు, ఐదవ తరగతుల ఇంగ్లీషు పాఠ్యపుస్తకాల గురించి, ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థుల పుస్తకాల గురించి ఆరా తీశారు. పాఠశాలలోని తరగతి గదులను, వంటశాలను, మరుగుదొడ్లను చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకుండా ఉండినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కూళ్లకు విద్యార్థులకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తీసుకువస్తే అధికారులకు చేరవేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రతి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పొందుపరిచాలని సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి వంట బాగుందని, ఏజెన్సీలను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం తింటున్న ఎంఇఒ రంగనాథయ్య

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. NO : 123/2019

తుంగా మహేశ్వరి భర్త నాగేశ్వర సాకిన్ పెద్దూరు గ్రామం, చిట్వేల్ మండలం, అన్నమయ్య జిల్లా.

...వాది

వర్సెస్

2.బాలు నాగమణి భర్త లేట్ శివయ్య

3.బాలు తారకరత్న లేట్ శివయ్య

మైనర్ అయినందున ఇతని తల్లి బాలు నాగమణి (D2) సాకిన్ పెద్దూరు గ్రామం, చిట్వేల్ మండలం, అన్నమయ్య జిల్లా.

...2,3 ప్రతివాదులు

వాది, ప్రతివాదుల పైన ప్రామిసరి నోట్ ను బట్టి దావా దాఖలు చేసి యుంటున్నది. సదరు విషయమై ప్రతివాదులకు ఆక్షేపణలున్న యెడల28.03.2023 తేదీ పగలు 10.30 గంటలకు పై కనిన కోర్టులో హాజరై మనవి చేసు కోవలెను. లేనంతట పరోక్షమున తీర్మానించిబడునని ఖండితముగా తెలపడమైనది.

పి.వల్లభరావు

వాదిపరం అడ్వకేట్,

రాజంపేట.

ఎపిఎండిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసి ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపిఎండిసి ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్,సిఐటియు అనుబంధం సంస్థల సమావేశం శుక్రవారం మంగంపేట రాముల గుడి వద్ద జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపిఎండిసి ఉద్యోగుల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు కాలం తీరిన ఇంతవరకు ఇవ్వలేదు. రెగ్యులర్, రిటైర్డ్ ఉద్యోగులకు జనవరి 30కి, అవుట్ సోర్స్, ట్రైనీ కార్మికులకు ఫిబ్రవరి 14కి కాల పరిమితి అయిపోయిందన్నారు. కొత్త ఇన్సూరెన్స్ కార్డులు ఇవ్వలేదు, ఆరోగ్య సమస్యలు వస్తే హాస్పిటల్స్ పట్టించుకోవడం లేదన్నారు. అప్పులు చేసి బిల్లులు కడుతున్నారు. సమాన పనికి సమాన వేతనం అమలులో కొందరికి అన్యాయం జరిగిందని న్యాయం చేయాలన్నారు. రెగ్యులర్ కార్మికులకు డిసిపి కమిటీ పెట్టి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేసిన ఉద్యమానికి సిఐటియు నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించారని అభినందించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతంగా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నారదాసు సుబ్బరాయుడు, కోశాధికారి మావిళ్ళ శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్రి శంకరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ జి వెంకటేష్, వర్కింగ్ సెక్రటరీ అంకయ్య బాబు, మావిళ్ళ రాధ పాల్గొన్నారు.

సమిష్టి కృషితో ఆస్పత్రి అభివృద్ధి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సమిష్టి కృషితో ఆస్పత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామని బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ తీర్మానించింది. శుక్రవారం కమిటీ సభ్యులు కంచి కళ్యాణ్‌కుమార్‌రెడ్డి, నక్కా మహేష్‌కుమార్, వైద్యులు కిరణ్, హసీనా, వైద్యసిబ్బంది, వైద్యేతర సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. నూతనంగా చిన్న పిల్లల వైద్యురాలిని నియమించారని పేర్కొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి సహకారంతో ఆస్పత్రిని మరింత అభివృద్ధిని చేస్తామన్నారు. వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించడం శుభపరిణామమన్నారు. ఆస్పత్రికి మహర్దశ తీసుక రావడానికి శాయశక్తులా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం

కాలిపోయిన వస్తు సామగ్రి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలం లోని మద్దిరేవుల గ్రామం దళితవాడకు చెందిన కత్తి శంకరయ్య గృహంలో శుక్రవారం తెల్లవారు జామున సమయంలో రిఫ్రిజిరేటర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లంతా మంటలు చెలరేగి ధనం, ధాన్యం, బట్టలు, వస్తువులు అన్ని కాలిపోయాయని కుటుంబ సభ్యులు తెలిపారు. మంటలు చెలరేగడంతో గ్రామస్తులు కొంత మేరకు మంటలు ఆర్పారు. వెంటనే ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, విఆర్ఒ ప్రసాద్, సెక్రెటరీ శివయ్య, సంఘటన స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని బాధితులను అడిగి తెలుసు కున్నారు. జరిగిన నష్టాన్ని నివేదికను పై అధికారులకు పంపుతామని విఆర్ఒ ప్రసాద్ తెలిపారు. బాధితులను మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. అధైర్య పడవద్దని ఆదుకుంటామని భరోసానిచ్చారు.

క్రైం కార్నర్

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు మహిళలు అరెస్టు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను సెబ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. మదనపల్లి సెబ్ సిఐ శ్రీహరిరెడ్డి వివరాల మేరకు.. పట్టణంలోని తేరువీధిలో నివాసముండే నాగరాజ భార్య సుబ్బమ్మ అదే ప్రాంతానికి చెందిన మరో మహిళ శంకరమ్మలు అక్రమంగా కర్ణాటక మద్యం తెప్పించి స్థానికులకు విక్రయించేవారన్నారు. గురువారం అందిన సమాచారంతో మదనపల్లి నుండి సెబ్ సిబ్బందితో వారి ఇళ్లపై దాడులు నిర్వహించి ఇరువురి మహిళను అరెస్టు చేసినట్లు తెలిపారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణా, విక్రయాలు, నాటుసారాతయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-ములకలచెరువు

అక్రమంగా తరలిస్తున్న 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని మహిళను అరెస్ట్ చేసి రిమాండు తరలించినట్లు ఎస్ఇబి సిఐ మల్లిక తెలిపారు. ఎస్ఇబి సిఐ కథనం మేరకు ములకలచెరువు ఎస్ఇబి కార్యాలయం పరిధిలోని పెద్దమండ్యం మండలం, వెలిగల్లు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో లక్ష్మిదేవి అనే మహిళ నుంచి 15 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకొని నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గుర్తుతెలియని యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గుర్తుతెలియని యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు..మండలంలోని కోళ్లబైలు వాటర్ ఫాల్స్ వద్ద గుర్తు తెలియని యువకుడు హత్యకు గురవడం శుక్రవారం వెలుగు చూసింది. ఓ యువకుడిని కోళ్లబైలు సమీపంలోని వాటర్ ఫాల్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చంపి పడేసి వచ్చేశారు. శవం కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో అక్కడి రైతులు గమనించారు. పోలీసులకు సమాచారం అందించారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



పట్టుబడిన వాహనాలు, ఎర్రచందనం, నిందితుడితో అటవీశాఖ అధికారులు

వేర్వేరు ప్రాంతాల్లో అటవీ శాఖ దాడులు

15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం, ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు అట వీశాఖ సంచార దళ నిఘా విభాగం రెండు వేర్వేరు ప్రాం తాల్లో నిర్వ హించిన దాడుల్లో రెండు కార్లు, ద్విచక్ర వాహ నంతో సహా నింది తుడిని అరెస్టు చేసినట్లు నిఘా విభాగం దళ క్షేత్రాధికారి ఎన్. వెంకటరమణ తెలిపారు. శక్రవారం స్థానిక నిఘావిభాగం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిఎఫ్ఒ డిఎ.కిరణ్‌కు అందిన సమాచారం మేరకు గురువారం రాత్రి పీలేరు-తలుపుల మార్గంలోని మల్లెల క్రాస్‌లో నిఘా ఉంచామన్నారు. ఈ సందర్భంగా అటుగా వచ్చిన ద్విచక్ర వాహనం, కారును అపగా వారు తమ వాహనాన్ని ఢీకొని, వాహనాలు వదలి చీకట్లో పరారయ్యారన్నారు. అదేవిధంగా తమకు అందిన మరో సమాచారం ఆధారంగా పీలేరు -చిత్తూరు మార్గంలోని తేనేపల్లి వద్ద నున్న టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు కారులోంచి దిగి ఫరారీ అవుతుండగా కారు నడుపుతున్న తమిళనాడుకు చెందిన కామరాజు నటరాజన్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన వాహనాల నుంచి 374 కేజీల బరువుగల 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహనాలతో సహా ఎర్రచందనం విలువ సుమారు రూ.22 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ దాడుల్లో సంచార దళ నిఘా విభాగం ఎఫ్‌బిఒలు కె.ప్రతాప్, ఎస్.కుప్పస్వామి, స్ట్రైకింగ్ ఫోర్స్ ప్రొటక్షన్ వాచర్లు ప్రభుతేజ, చరణ్ పాల్గొన్నారు. ఈ దాడుల్లో పారిపోయిన నిందితుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎఫ్ఆర్ఒ తెలిపారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, కలకడ

రె.క నెం. 09/2023 తేది: 03.03.2023

బహిరంగ వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా ! కలకడ గ్రామ పంచాయతీకి చెందిన 1) వారపు కూరగాయల సంత 2) బస్టాండు గేటు (RTC మినహా) 3) దినసరి మార్కెట్ (టమోటా) వారపు సంత రోజు మినహా 4) జంతు వధశాల 5) గ్రామ పంచాయతీ షాపింగ్ రూములు నందు రుసుములు వసూళ్ళు చేసుకొను హక్కులకు 2023-2024 వ సంవత్సరమునకు (అనగా 01.04.2023 నుండి 31.03.2024 వరకు) తేది 09.03.2023 గురువారము సా॥ 3.00 గంటలకు గ్రామ సచివాలయము కలకడ యందు బహిరంగ వేలము వేయబడును. వేలముల యందు పాల్గొనువారు వేలము నోటిఫికేషన్ నిబంధనలకు లోబడి క్రింద కనిన గుత్తలు వాటికి ఎదురుగా కనిన డిపాజిట్లు పంచాయతి కార్యదర్శి, కలకడ వారికి వేలమునకు ముందు నగదు పంచాయతి, కార్యదర్శి, గ్రామ పంచాయతి, కలకడ వారికి డిపాజిట్లు చెల్లించి సాల్వెన్సీ సమర్పించవలయును.

వ. సంఖ్య	గుత్త వివరములు	చెల్లించవలసిన ధరావత్తు	సాల్వెన్సీ ధృవ పత్రము	సాల్వెన్సీ లేనివారు చెల్లించవలసిన ధరావత్తు
1	వారపు కూరగాయల సంత	రూ.4,00,000/-	రూ. 4,00,000/-	రూ. 10,00,000/-
2	బస్టాండు గేటు (RTC మినహా)	రూ.2,00,000/-	రూ. 2,00,000/-	రూ. 3,00,000/-
3	దినసరి మార్కెట్ (టమోటా) వారపుసంత రోజు మినహా	రూ.4,00,000/-	రూ. 4,00,000/-	రూ. 10,00,000/-
4	జంతు వధశాల	రూ. 2,000/-	రూ. 5,000/-	రూ. 10,000/-
5	గ్రామ పంచాయతీ షాపింగ్ రూములు 1,2 మరియు 3 గదులు	రూ.1,00,000/-	రూ. 1,00,000/-	రూ. 2,00,000/-

షరతులు :

1. వేలములో పాల్గొనువారు పంచాయతీకి ఎలాంటి పన్నులు, కిస్తులు మరియు లీజు మొత్తములు బాకీలు ఉండరాదు.
2. వేలము నందు షెడ్యూలులో కనిన మేరకు డిపాజిట్లు మరియు సాల్వెన్సీ హాజరుపరచినవారు మాత్రమే పాల్గొనవలెను. బినామీలు మరియు ఆథరైజేషన్ వారు వేలము నందు పాల్గొనరాదు. అందులకు అనుమతించబడదు.
3. వేలంలో పాల్గొనువారు తమకు సంబంధించిన ఇంటిపన్ను రసీదు, రేషనుకార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను సమర్పించిన సదరు బహిరంగపు వేలంలో పాల్గొనవలెను మరియు తదుపరి నోటిఫికేషన్ నిబంధనల మేరకు వేలములు నిర్వహించబడును.
4. ఏ కారణము తెలుపకనే వేలము పాటను నిలుపుదల చేయుటకు వాయిదా వేయుటకున్ను మరియు రద్దు పరచుటకున్ను పంచాయతీ కార్యదర్శి గారికి పూర్తి అధికారము కలదు.
5. వేలము పాట ముగిసిన వారము రోజుల లోపుగా హెచ్చుపాటదారు వేలము మొత్తమును ఒకే దఫా చెల్లించవలెను.అట్లు గడువు లోపల సదరు మొత్తమును చెల్లించని యెడల సదరు వేలమునకు హెచ్చుపాటదారు చెల్లించిన వేలము డిపాజిట్లును పంచాయతీ నిధికి దండుగ క్రింద జమకట్టుకొని రెండవ హెచ్చుపాటదారునికి అవకాశము కల్పించబడును. లేదా పంచాయతీ కార్యదర్శి వారు సదరు వేలము పాటను రద్దుచేయుటకు అధికారము కలదు.
6. సదరు హెచ్చుపాటదారులు హెచ్చుపాటకు 3% స్టాంప్ డ్యూటీ, హెచ్చుపాట ముగిసిన వెంటనే పంచాయతీకి చెల్లించవలెను.
7. సదరు హెచ్చుపాటదారులు తమ స్వంత ఖర్చులతో రూ.100 స్టాంపు పేపరుపై అగ్రిమెంటు వ్రాసి ఇవ్వవలెను.

సం॥ ఆర్. నందిని, M.A., B.Ed., పంచాయతీ సెక్రటరీ, గ్రామ పంచాయతీ, కలకడ, కలకడ మండలం, అన్నమయ్య జిల్లా

శ్రీమతి టి. ప్యారీజాన్ సర్పంచ్, గ్రామ పంచాయతీ, కలకడ మండలం, అన్నమయ్య జిల్లా

సం॥ సి.హెచ్. నారాయణ, M.A., M.P.D.O. కలకడ మండలం, అన్నమయ్య జిల్లా.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : PILER

S.O.P.No. 02 of 2023

1. E.MD.Ajeemuddin
2. Patan Ayesha Jan
3. T.Asma Begam
4. S.Sajidhunnisa
5. E.Gulnaz Begam
6. E.MD.Fayazuddin
7. E.Nusrath Fathima (Minor)

(7th Petitioner is minor, rep.by her mother, guardian the 5th petitioner herein.)

...Petitioners

Vs

NIL. ...Respondent

జనరల్ నోటీసు

అయ్యా!

పై కనిన S.O.P.No.02 of 2023 నందు పిటిషనర్లు, 1 నుండి 4 పిటిషనర్ల తల్లిదండ్రులు, 5వ పిటిషనర్ అత్త మామ (భర్త తల్లిదండ్రులు), 6&7వ పిటిషనర్లకు అవ్వ తాతలు అయిన ఇ.ప్యారిజాన్, ఇ.కాలేషా గార్లు పీలేరు పోస్ట్ ఆఫీస్ నందు ఉమ్మడి పొదుపుఖాతాను కలిగి వుండి, ఇ.ప్యారిజాన్ తేది: 25.04.2011న, మరియు ఇ.కాలేషా తేది: 10.05.2021న గతించగా, నామినీ అయిన ఇ.నిజాముద్దీన్ కూడా తేది: 12.05.2021న మరణించి ఉన్నారు. కావున కింద కనిన షెడ్యూల్‌లో చూపబడిన సంబంధించి పొదుపు ఖాతా విషయమై వారసత్వ సర్టిఫికేట్ మంజూరు చేయమని పిటిషనర్లు పై నందు కోరి ఉన్నారు. ఈ విషయమై ఎవరికైన ను అభ్యంతరాలు ఉన్న యెడల, వారు తేది: 31.03.2023 ఉదయం గం.10.30 ని॥హాజరు అయి వారి యొక్క అభ్యంతరాలు తెలుపుకొనవచ్చును. అలా లేనిచో క్రింద కనపరచిన పోస్ట్ పొదుపు ఖాతా యొక్క పైకము మీద పిటిషనర్లకు వారసత్వ సర్టిఫికేట్ మంజూరు చేయబడును.

SCHEDULE

The following is the debt for which the certificate is applied for :

1. Name of the Debtor : Post Office, Piler Branch.
Amount due onthe date of Petition : Rs.6,16,149/- Along with accrued interest.
Description and date of instrument by which the debt is secured : Postal savings Account at Post Office, Piler branch.

//By Order of the Court//

P. SHOWKATH ALI, M.A.,B.L.,

Advocate, Piler.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : PILER

S.O.P.No. 01 of 2023

Sunanda Ali ...Petitioner

Vs

NIL. ...Respondent

జనరల్ నోటీసు

అయ్యా!

పై కనిన S.O.P.No.01 of 2023 నందు పిటిషనరు తల్లిగారైన శాంత రమేష్ సనడి గారు క్రింద షెడ్యూలులో కనబరచిన షేర్స్‌ను కొని ఉండి, తదుపరి పిటిషనరు తల్లిదండ్రులైన సనడి రమేష్ రావు & శాంత రమేష్ సనడి గార్లు తేది: 28.09.2000న రిజిస్టరు వీలునామా ద్వారా క్రింద కనిన షెడ్యూలులో కనబరచిన షేర్స్‌ను పిటిషనరు వాటాకు ఇవ్వడమైనది. అయితే సదరు సనడి రమేష్‌రావు తేది: 14.09.2006న శాంత రమేష్ సనడి తేది: 26.11. 2021న గతించినారు. కాగా షెడ్యూలులో కనబరచిన షేర్స్ విషయమై వారసత్వ సర్టిఫికేట్ మంజూరు చేయమని పిటిష నరుపై కోర్టు నందు కోరి ఉన్నారు. ఈ విషయమై ఎవరికైన ను ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో, తేది: 31.03.203న ఉదయం 10.30నిమిషములకు పై కోర్టు ఎదుట హాజరై వారి యొక్క అభ్యంతరములు తెలుపవలెను. అట్లు లేని యెడల సదరు షేర్స్ మీద పిటిషనరుకు వారసత్వ సర్టిఫికేట్ మంజూరు చేయబడును.

SCHEDULE

The following is the debt for which the certificate is applied for :

1. Name of the Scheme : UTI Flexi Cap Fund (formerly known as UTI Equity Fund)- Regular Plan- Payout.
Amount due on 03-10-2022 : Rs.3,45,594/- as on 03.10.2022.
Description and date of instrument by which the debt is secured : UTI Flexi Cap Fund (formerly known as UTI Equity Fund)-Regular Plan-Payout.

//By Order of the Court//

P. SHOWKATH ALI, M.A.,B.L.,

Advocate, Piler.

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S. No : 44/2022

తోట సుధాకర్ తండ్రి వెంకటయ్య డోర్ నెంబర్ 5/469-F, ఎగువ వద్ద గడ్డ వీధి, రాజంపేట టౌన్, అన్నమయ్య జిల్లా.

...వాది

వర్సెస్

పోకల సుజిత భర్త సోమేసుల సురేష్ బాబు డోర్ నెంబర్ A/96, పోలీస్ గ్రౌండ్, చంద్రాపూర్, మహారాష్ట్ర స్టేట్, ప్రస్తుత నివాసం డోర్ నెంబర్ 134, స్ట్రీట్ నెంబర్ 800, సుదర్శన్ థియేటర్ ఎదురుగా, రాజంపేట టౌన్.

...ప్రతివాది

దావా సమను

వాది, ప్రతివాది యగు నీ పైన అన్ రిజిస్టర్ అగ్రిమెంట్ ఆఫ్ సేల్ యొక్క షరతుల ప్రకారం రిజిష్టర్ దస్తావేజు రాయించాలని పై దావా ను దాఖలు చేసియుంటున్నారు. పై దావాలో వాది ప్రతివాదికి అనేక మార్లు సమన్లు పంపినను తీసుకొనలేదు. కావున ప్రతివాది పై కోర్టులో 16. 03.2023 వ తేదీన ఉదయం 10.30 గంటలకు స్వయంగా గానీ, లాయర్ ద్వారా గానీ హాజరై మనవి చేసుకోనంతట పరోక్షమున తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

ఏ.వి.సుబ్రమణ్యం, బీ.కాం., బి.ఎల్.,

నందలూరు. సెల్ : 9440129650

మహారాజశ్రీ రైల్వే కోడూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No : 189/2022

కొనిరెడ్డి సురేఖ. ...వాది

వర్సెస్

ఇరగలి పార్ధ సారధి తండ్రి రంగయ్య ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ డోర్ నెంబర్ 8-142, రాంనగర్ వడ్డిపల్లి, రైల్వే కోడూరు టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా.

...ప్రతివాది

దావా సమను

వాది, ప్రతివాది అయిన మీపై ప్రామిసరీ నోట్లు బాకీ వసూలు నిమిత్తం పై తెలిపిన దావాను, పై కనిన కోర్టులో దాఖలు చేసియున్నారు.ఇందులకు మీకు ఏదైనా ఆక్షేపణలు ఉన్నచో 13.03.2023వ తేదిన ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలుపడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

మద్దిన శంకరయ్య

న్యాయవాది,

రైల్వే కోడూరు.